# కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ సర్కారు

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడకపోతే ఆందోళనలు ఉధృతం

పట్టణాల్లో కూడా ఉపాధిహామీ ప్రవేశపెట్టాలి

గోదావరి వరద బాధితుల సహాయక చర్యల కోసం అఖిల పక్ష సమావేశం

బిజెపి మతోన్మాదాన్నిప్రశ్నించేది ఒక్క కమ్యూనిస్టులే

అమ్మవడి తరహాలో ప్రైవేటు పాఠశాలల టీచర్లకు రూ.10వేలు చెల్లించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు దోచిపెడుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని లేని పక్షంలో అన్ని పార్టీలతో చర్చించి దేశ, రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు.. కేంద్ర ప్రభుత్వం పభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలన్నారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 20 నుంచి 26వరకు జరిగిన నిరసనల కార్యక్రమం ముగింపు సభ సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్. బాబూరావు అధ్యక్షతన బుధవారం స్థానిక బిఎస్ఆర్రోడ్డులో జరిగింది. సభకు ముఖ్య అతిధిగా హాజరైన మధు మాట్లాడుతూ గోదావరి వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోకుండా వారిని గాలికి వదిలేసిందన్నారు. బాధితులను ఆదుకునేందుకు , తక్షణమే సహాయకచర్యలు చేపట్టే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కష్ట కాలంలో సామాన్య ప్రజలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇందుకు భిన్నంగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారదత్తం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కరోనాతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పట్టణాల్లో ప్రవేశపెట్టాలని, ఉపాధి కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఆరు నెలల పాటు నెలకు రూ.7,500లు , నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరోనా రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని, సరిపడినన్ని వెంటిలేటర్లు, బెడ్లు లేక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. నెల్లూరులో కరోనాతో మృత్యువాత పడిన ఐదుగురి అంత్యక్రియలను సిపిఎం పార్టీ కార్యకర్తలు ఎంతో సాహసోపేతంగా నిర్వహించారన్నారు.. కరోనా వ్యాధిగ్రస్తుల కోసం ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటుతో పాటు స్వచ్ఛందంగా పనిచేసేందుకు 550 మంది వాలంటీర్లను సిద్ధం చేసి ప్రభుత్వానికి లేఖలు రాశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సహకారం తీసుకునేందుకు ముందుకు రాలేదన్నారు. కోవిడ్ కాకుండా సాధారణ వ్యాధిగ్రస్తులకు విజయవాడలోనే వైద్యం అందని పరిస్థితి నెలకొందన్నారు. జనరల్ ఆసుపత్రి, ఇఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్యం సరిగ్గా అందడం లేదన్నారు. ఇటీవల కాలంలో కమ్యూనిస్టుల బలం తగ్గిందని కొందరు అంటున్నారని, బిజెపి మతోన్మాద వైఖరితో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పార బట్టేది ఒక్క కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. ముఖ్యమంత్రి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపి కేకళ తరహాలో మునిసిపల్, గ్రామ పంచాయతీలను సహాయక చర్యల్లో భాగస్వామ్యం చేయాలని మధు డిమాండ్ చేశారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కరోనా రోగుల సంఖ్య ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలోకి చేరేందుకు దగ్గర్లో ఉన్నామని, ఇందుకు మోడీ అవలంబిస్తున్న విధానాలే కారణమన్నారు. కోవిడ్పై సరియైన చర్యలు తీసుకోకుండా రాష్ట్రాలపైకి నెట్టివేసి కేంద్రం చేతులు దులుపుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దేశ భక్తి ముసుగులో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. పారాసిటమాల్ వేసుకుంటే కరోనా పోతుందని ముఖ్యమంత్రి జగన్ చెప్పారని, రాష్ట్రంలో మృత్యువాత పడిన మూడు వేల మంది మరణానికి కారకులెవరో ప్రజలకు ఆయన సంజాయిషీ ఇచ్చుకోకతప్పదన్నారు. కరోనా నివారణపై దృష్టి పెట్టకుండా రాజధాని మార్పుపై దృష్టి పెట్టడంతోనే రాష్ట్రంలో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. కేరళ ప్రభుత్వం కరోనా నివారణ చర్యలు చేపట్టడంలో సఫలీకృతులైందని ఐక్యరాజ్యసమితి కూడా మెచ్చుకుందన్నారు. కరోనా ప్యాకేజీ కేంద్రం ప్రకటించిన దాని కంటే కే రళ ప్రభుత్వం అంతకంటే ఎక్కువ ప్రకటించిందన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సి.హెచ్. బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలను ఆదుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా నిరసనల కార్యక్రమం ముగిసినప్పటికీ సామాన్యులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు వివిద మార్గాల్లో ఉధృతంగా సాగుతూనే ఉంటాయన్నారు. కరోనా రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రమాదేవి మాట్లాడుతూ ఆన్లైన్ పేరుతో రాష్ట్రంలో ఇసుక దందా కొనసాగుతోందన్నారు. సామాన్యులకు పనులు దొరక్క ఇబ్బందులు పడుతుంటే అటువంటి వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. గర్భవతులకు ప్రసూతి చేయలేని స్థితిల్లో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. కోవిడ్ పరీక్ష ఫలితాలు వచ్చాకే అని అంటుండటంతో ప్రసవానికి వచ్చే మహిళలకు సకాలంలో వైద్యం అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బా రావు మాట్లాడుతూ మోడీ సర్కారు సెక్యులర్ విధానానికి తూట్లు పొడుస్తోందన్నారు. కరోనా మృతుల గురించి కేంద్ర, రాష్ట్రాలు పట్టించుకోవడం లేదన్నారు. దేశం ఎదుర్కొంటున్న సంక్షోభం నుంచి బయట పడేందుకు మార్గాలను అన్వేషించకుండా మతోన్మాదం వైపు , ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారదత్తం చేసే పనిలో ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఉమా మహేశ్వరరావు, ఎం . కృష్ణమూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు డి. కాశీ విశ్వనాథ్, ఎం. శ్రీదేవి, పశ్చిమ కృష్ణా కార్యదర్శి డివి. కృష్ణ పాల్గన్నారు.